## విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

పెదగంట్యాడ : 11 కేవీ వూడా ఫీడర్ పరిధిలో మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో ఈ నెల 27న విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని ఏపీఈపీడీసీఎల్ జోన్ – 2 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బీకే నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు వూడా ఫీడర్ పరిధిలో టీఎన్నార్ రోడ్డు, సిద్ధేశ్వరం, వెంపళ్లనగర్, సమతానగర్, టీజీఆర్ నగర్ తదితర ప్రాంతాల్లో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం తప్పదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

## నేడు నీటి సరఫరా ఉండని ప్రాంతాలివీ..

గాజువాక : గాజువాక జోన్‌లోని వివిధ వార్డుల్లో నీటి సరఫరాకు శుక్రవారం అంతరాయం కలుగుతుందని జీవీఎంసీ నీటి సరఫరా విభాగం సహాయ ఇంజినీర్ కేదార్‌నాథ్ తెలిపారు. స్థానిక సుందరయ్య కాలనీలో గల 10 ఎంజీడీ మంచినీటి శుద్ధి కర్మాగారానికి ముడి నీరు (రా వాటర్) వచ్చే 1000 ఎంఎం డయా పైప్‌లైన్‌కు రైల్వే ట్రాక్ వద్ద అత్యవసర మరమ్మతులతోపాటు వివిధ రకాల చిన్నచిన్న పనులను కూడా చేపట్టాల్సి ఉందన్నారు. ఈ కారణంగా 64, 65, 70 నుంచి 74, 76వ వార్డుకు నీటి సరఫరా నిలిచిపోతుందని, ప్రజలంతా సహకరించాలని కోరారు.



## క్లుప్తంగా

### పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



ఆస్పత్రి ఆవరణలో చెత్త, తుప్పలు తొలగిస్తున్న వైద్యాధికారి సంపత్‌బాబు, సిబ్బంది

పెదగంట్యాడ : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యానికి భద్రత లభిస్తుందని పెదగంట్యాడ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎం.సంపత్‌బాబు అన్నారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా గురువారం పీహెచ్‌సీ పరిధిలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. సిబ్బందితో కలిసి ఆస్పత్రి ప్రాంగణం శుభ్రం చేశారు. అనంతరం ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే అందరం ఆరోగ్యంగా ఉంటామన్నారు.. ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాల్లో మొక్కలు నాటి సంరక్షించుకోవాలలి సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి తనకాల సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

### 87వ వార్డులో సేవా కార్యక్రమాలు



తిరుమలనగర్ పార్కులో ముళ్లపొదలు తొలగిస్తున్న నాయకులు, సిబ్బంది

కూర్మన్నపాలెం. జీవీఎంసీ 87వ వార్డులో గురువారం ఏక్ దిన్ ఏక్ గంట ఏక్ సాత్‌లో భాగంగా సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డులోని తిరుమలనగర్‌లో పార్కులను శుభ్రం చేశారు. అలాగే రహదారుల పక్కన ఉన్న ముళ్ల పొదలను తొలగించారు. జోన్ – 6 ప్రజారోగ్య శాఖ అధికారి కిరణ్‌కుమార్, వార్డు కార్పొరేటర్ బొండా జగన్, విశ్వేశ్వరరావు, పరమానందం, ఉమామహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

### సిమెంట్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా సీపీఎం ధర్నా



పెదగంట్యాడ జంక్షన్‌లో ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

పెదగంట్యాడ: అదానీ సిమెంట్ ఫ్యాక్టరీ అనుమతులు వెంటనే రద్దు చేయాలని సీపీఎం నాయకులు కోరారు. ఈ మేరకు పెదగంట్యాడ జంక్షన్‌లో గురువారం సాయంత్రం పెద్ద ఎత్తున ధర్నా చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఇప్పటికే గంగవరం పోర్టు కాలుష్యంతో స్థానికులు అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్నారని, సిమెంట్ ఫ్యాక్టరీ వల్ల మరిన్ని సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయకుండా చూడాలని డిమాండ్ చేశారు. అనంతరం పెదగంట్యాడ జంక్షన్ నుంచి నడుపూరు జంక్షన్ వరకు ర్యాలీగా ప్రదర్శన చేశారు. అదానీ సిమెంట్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా నినాదాలతో హోరెత్తించారు.

### వాహనమిత్ర దరఖాస్తులకు గడువు పెంచాలి

మద్దిలపాలెం : ఆటో అండ్ మోటార్ డ్రైవర్లకు వాహన మిత్ర దరఖాస్తు కోసం గడువు పెంచాలని సీతమ్మధార హెచ్‌బీకాలనీలోని వుడా అపార్ట్‌మెంట్ వద్ద గల శిరిడీ సాయి ఆటో స్టాండ్ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా గురువారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆటో ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పడాల గోవింద్ మాట్లాడుతూ డ్రైవర్లందరికీ వాహన మిత్ర దరఖాస్తుకు గడువు పెంచి రూ.15 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం తక్కువ సమయం ఇవ్వడంతో పాటు సచివాలయ సిబ్బంది సర్వర్లు పనిచేయడం లేదని కుంటి సాకులు చెప్పారాని ఆరోపించారు. ఈ నెల 24న కొత్త, పాత సభ్యుల నమోదును పూర్తిగా నిలిపివేశారని, దీంతో వేలాది మంది లబ్ధిదారులు వారి పేర్లు నమోదు చేసుకోలేపోయరంటూ ఆవేదన వ్యక్తం చేశారు. మిగతా డ్రైవర్ సోదరులందరూ వాహన మిత్ర కోసం దరఖాస్తు చేసుకునేందుకు వీలుగా గడువు పెంచి ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆటో డ్రైవర్ల ఆగ్రహానికి ప్రభుత్వం గురికాక తప్పదని హెచ్చరించారు. డ్రైవర్లు అవనాపు శ్రీను, లంక గోవింద్, అప్పలనాయుడు, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

# అరుదైన పూలు.. ఆధ్యాత్మిక సిరులు



చెట్టుకు విడివిడిగా పూసిన పూలు



పువ్వు మధ్యలో నాగసర్పం ఆకారం



చెట్టు జటాజూటానికి పూసిన పూలు



నాగమల్లిలో శివ లింగ రూపం

- శివ మహత్యంతో అలరారుతున్న నాగమల్లి పుష్పాలు
- పూల మధ్యలో నాగసర్పం.. శివలింగాకారం
- రాజీవ్‌నగర్ వుడా కాలనీకి ప్రత్యేకం ఈ పూలు

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 86వ వార్డు రాజీవ్‌నగర్ వుడా కాలనీలో లభిస్తున్న నాగమల్లి పూలకు ఒక ప్రత్యేకత ఉంది. అరుదుగా దొరికే పూల పట్ల భక్తులు ఎంతో మక్కువ చూపుతారు. ఈ పూలలో శివ మహత్యం ఉంటుందని నమ్ముతారు. వీటిని పూజకు తప్ప మరి దేనికీ ఉపయోగించరు. అందువల్లే రాజీవ్‌నగర్‌లో రెండు మూడు చోట్ల ఉండే ఈ చెట్ల వద్దకు ఎక్కువ మంది మహిళలు వచ్చి పూలు కోసుకు వెళ్తుంటారు. వాటిని కూడా దేవుని ముందు పెట్టి పూజించుకుంటారు. ముఖ్యంగా హిందువులు శివుడు నాగమల్లి చెట్టులో కొలువై ఉంటాడని బలంగా నమ్ముతారు. నాగమల్లి పుష్పంలో సర్పంతో కూడిన శివ లింగం ఉందని, వృక్షరూపంలో శివుడు దర్శనం ఇస్తాడని భక్తులు భావిస్తారు. అంతే కాకుండా శివునికి కూడా నగమల్లి పూలంటే అత్యంత ప్రీతికరం అన్న నానుడి కూడా లేకపోలేదు. అందువల్లనే శివుడికి ఈ పుష్పాలతో పూజలు చేస్తారని వేద పండితులు సైతం చెబుతున్నారు. అలాగే శివునికి ఈ పుష్పాలతో పూజ చేస్తే జన్మరాహిత్యంతో పాటు కైవల్యం సిద్ధిస్తుందని పురాణాలు కూడా చెబుతున్నాయి. దీనిని దృష్టిలో పెట్టుకుని ఈ పూలను దేవుని కాళ్ల ముందు కాకుండా శిరస్సు లేదా భుజాల పైన పెట్టి పూజలు చేయాలని పలువురు సూచిస్తున్నారు.

**పలు విశిష్టతల సమాహారం..**

ఈ పుష్పం విశిష్టత విషయానికి వస్తే దీనినే శివలింగ పుష్పం.. మల్లికార్జున పుష్పం అని కూడా పిలుస్తారు. ఇవి అరుదుగా లభించడం వల్ల శైవ సాంప్రదాయంలో అతి పవిత్రంగా భావిస్తారు. అలాగే సుగంధభరితంగా ఉండడంతో పాటు విలక్షణమైన రూపంలో కంటికి ఇంపుగా కన్పించడం ఈ పుష్పాల ప్రత్యేకత. శివలింగ వృక్షం శాస్త్రీయ నామం కిషన్ బాల్ ట్రీ అని రాజీవ్‌నగర్ వాసులు పేర్కొంటున్నారు. ఈ వృక్షాలు, పుష్పాలు దక్షిణ భారతదేశం, దక్షిణ అమెరికాలో తప్ప ఇంకెక్కడా కన్పించవని వీటి పూర్వపరాలు తెలిసిన వారు తెలిపారు. ఈ పుష్పం మధ్య భాగంలో పడగవిప్పిన సర్పం ఆకారం దర్శనం ఇవ్వడం గమనార్హం.

ఈ పూలు పూసే విధానం మరీ వింతగా ఉంటుంది. ఈ చెట్టు ఆకరం శివుని జటాజూటంలా ఉంటుంది. వెంట్రుకల్లా ఉండే భాగానికి పూలు పూస్తాయి. ఆకులు, కొమ్మలు మామూలుగానే ఉంటాయి. ఒకే దగ్గర ఎక్కువగా పూయడం వల్ల చెట్టు దగ్గరకి వెళ్లే వరకు అక్కడ పూలున్నాయన్న సంగతి కూడా ఎవరికీ తెలియదు. ఈ పుష్పానికి ఉండే మరో విశేషమేమిటంటే పైభాగాన నాగపడగ కప్పి ఉన్నట్లుగా కనిపిస్తుంది. లోపల మాత్రం శివలింగం ఆకృతి స్పష్టంగా ఉంటుంది. అందువల్లే ఈ పుష్పాలను ప్రజలు దైవంగా భావించి అపురూపంగా చూసుకుంటారు. ఈ పూల చెట్లు ఒక్క రాజీవ్‌నగర్‌లోనే ఉండడం పట్ల అక్కడి వారు అదృష్టంగా చెప్పుకుంటారు. ఈ పూలు ఇంకెక్కడా దొరకవని, దొరికినా ధర ఎక్కువగా ఉంటుందని చెబుతున్నారు. బయటి మార్కెట్లో ఒక పూవు ధర కనీసం రూ. 40 నుండి రూ. 50 వరకు ఉంటుందని అంటున్నారు. కార్తీకమాసలో అయితే ఎక్కడెక్కడి వారో ఈ పూల కోసం వస్తారని అక్కడి వారు తెలిపారు. స్థానికులు రోజూ పూలు కోసి ప్రతి దేవాలయంలో ఆ పూలతో పూజలు చేస్తామంటున్నారు.





రాజీవ్‌నగర్‌లో అరుదైన నాగమల్లి వృక్షం

వుడా కాలనీలో విరబూసిన నాగమల్లెలు

### శివార్చనకు ఎంతో శ్రేష్టం..



నాగమల్లి పూలతో శివునికి అర్చన చేస్తారు. ఈ పూలతో అర్చన చేయడం వల్ల ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు సులభంగా అభిస్తాయని పురాణాలు చెబుతున్నాయి. అందుకే నాగమల్లి పూలకి అంతట ప్రాముఖ్యత.

– ఎం.వెంకట శ్రీనివాసశర్మ, పురోహితులు, కణితి

### అమ్మవార్లకూ ప్రీతిపాత్రం..



శివునితో పాటు అమ్మవార్లకు కూడా నాగమల్లి పూలతో పూజలు చేస్తాం. ఈ పూలు అరుదుగా దొరుకుతాయి. ఇవి ఆరోగ్యానికి కూడా దోహదపడతాయని ఆయుర్వేద వైద్యులు పేర్కొంటున్నారు. అందువల్లే రాజీవ్ నగర్ వెళ్లి తెచ్చుకుంటాం.

– కె.భారతి, గృహిణి, కూర్మన్నపాలెం

### నాగమల్లి పూలు పవిత్రమైనవి..



నాగమల్లి పూలు అత్యంత పవిత్రమైనవని పండితులు పేర్కొంటున్నారు. వీటికి శివారాధనలో ప్రత్యేకస్థానం ఉంది. అందువల్ల కేవలం దక్షిణ భారతదేశంలోనే దొరికే ఈ పూలను శక్తివంతమైనవిగా భావిస్తున్నాం.

– రమణమ్మ, కణితి కాలనీ

## మహిళలకు చీరల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

పెదగంట్యాడ : తల్లిదండ్రుల వర్ధంతిని పురస్కరించుకుని సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయని గాజువాక మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. జీఏఆర్ ట్రస్ట్ అధినేత గొందేశి అప్పలరెడ్డి, శ్రీదేవి దంపతుల ఆధ్వర్యంలో గొందేశి అప్పలరెడ్డి, అప్పయ్యమ్మ 10వ వర్ధంతి వేడుకలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నసమారాధనను నాగిరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో పులి వెంకట రమణారెడ్డి, కొయ్య భారతి, గుజ్జు ఉమ, మధు, గొందేశి దేవి, ప్రసాద్ రెడ్డి, ప్రకాష్‌రెడ్డి, గౌతమ్ రెడ్డి, పృథ్వీ, కృష్ణారెడ్డి, గొందేశి వెంకట రమణారెడ్డి, రాము, పిట్టా రెడ్డి, చందన సిస్టర్స్ పాల్గొన్నారు.

## పోరాట యోధుడు ఏబీ బర్ధన్



ఏబీ బర్ధన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

పెదగంట్యాడ: ప్రజల పక్షాన పోరాడిన యోధుడు ఏబీ బర్ధన్ అని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ అన్నారు. పార్టీ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి బర్ధన్ వేడుకలను పోతిన సన్యాసిరావు భవన్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పెదపూడి దుర్గారావు, వనజాక్షి, ఆనంద్, పోతయ్య, దుర్గారావు, అచ్యుతరావు, చంద్రశేఖర్, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

## దీన్‌దయాళ్ ఉపాధ్యాయకు ఘన నివాళి



దీన్‌దయాళ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

గాజువాక : బీజేపీ సిద్ధాంతకర్త పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయకు ఆ పార్టీ నాయకులు గురువారం ఘన నివాళులర్పించారు. పాతకర్ణవానిపాలెంలో నిర్వహించిన జయంతి కార్యక్రమంలో ఆయన చిత్రపటం వద్ద బీజేపీ గాజువాక కన్వీనర్ కరణం రెడ్డి నర్సింగరావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాశ్చాత్య సిద్ధాంతాలకు ప్రత్యామ్నాయంగా, భారతీయ విలువలకు ప్రతిరూపంగా దీన్‌దయాళ్ ఉపాధ్యాయ అందించిన సిద్ధాంతం స్ఫూర్తిదాయకమన్నారు. ఆయన సిద్ధాంతాలకు అనుగుణంగా ప్రధానమంత్రి మోదీ పాలన సాగుతోందన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు గూటూరు శంకరరావు, ఒమ్మి రంగనాయకులు, పేర్ల అప్పారావు, వరలక్ష్మి, అశోక్, కృష్ణారెడ్డి, తాతారావు, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

- బీజేపీ గాజువాక కో ఆర్డినేటర్ దీనంకొండ కృష్ణంరాజు ఆధ్వర్యంలో పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతిని ఘనంగా నిర్వహించారు. 70వ వార్డు ఎల్వీనగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు డి.పావని, బి.వీరయ్య, సీహెచ్. శివాజీరాజు, బి.గణపతిరాజు, వూట రూపేష్ తదితరులు పాల్గొన్నారు.

## సన్నద్ధతతో ప్రాణనష్టం నివారించవచ్చు

మద్దిలపాలెం : ముందస్తు సన్నద్ధతతో భూకంప ప్రమాదాల సమయంలో ప్రాణ నష్టాన్ని నివారించవచ్చని ఐఐటీ ఖరగ్‌పూర్ జియాలజీ జియో ఫిజిక్స్ విభాగం ఆచార్యులు విలియమ్ కుమార్ మహంతి అన్నారు. ఏయూను గురువారం సందర్శించిన ఆయన భూకంప ప్రమాదాలు, సంబంధిత పరిశోధనలపై రసాయన శాస్త్ర విభాగ సమావేశం మందిరంలో ప్రసంగించారు. భూకంపాలపై తగిన అవగాహన, సన్నద్ధత కలిగి ఉంటే నష్టాన్ని తగ్గించవచ్చని సూచించారు. భూకంపాలను తట్టుకునేలా నిర్మాణాలు చేపట్టేందుకు ప్రస్తుతం విస్తృతంగా అధ్యయనాలు జరుగుతున్నాయని తెలిపారు. ఐఐటీ ఖరగ్‌పూర్ జియాలజీ జియో ఫిజిక్స్ విభాగం ఆచార్యులు సైబాల్ గుప్త, వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## స్టీల్‌ప్లాంట్ అభివృద్ధిలో ఉద్యోగుల కృషి భేష్



పదవీ విరమణ చేసిన ఉద్యోగులతో మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, నాయకులు

ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ అభివృద్ధిలో ఉద్యోగుల కృషి అభినందనీయమని గాజువాక మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. ఈ నెలాఖరున పదవీ విరమణ చేస్తున్న రాజేంద్రప్రసాద్, వీఆర్ఎస్ తీసుకున్న మార్టుపూడి పరదేశి, ఇంటిబిల్లి ప్రకాశ్, గంట్యాడ సత్యారావు, ఎ.రమణను గురువారం బ్లాస్ట్‌ఫర్నేస్ విభాగంలో ఘనంగా సత్కరించారు. ముఖ్య అతిథిగా హాజరైన నాగిరెడ్డి మాట్లాడుతూ ప్లాంట్ అనేక ఒడిదొడుకులు ఎదుర్కొన్నప్పటికీ వాటిని అధిగమించడంలో ఉద్యోగుల పాత్ర ఎనలేనిదన్నారు. వారి భవిష్యత్ జీవితం ఆనందదాయకంగా ఉండాలని ఆకాంక్షించారు. మంత్రి రాజశేఖర్ మాట్లాడుతూ ప్లాంట్ ఉత్పత్తిలో బీఎఫ్ విభాగం కీలకమైందన్నారు. ఇటువంటి ఉద్యోగులు పదవీ విరమణ చేయడం వల్ల విభాగానికి నష్టం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రామ్మోహన్, కె.ఎల్.ప్రసాద్, చంద్రశేఖర్, లక్ష్మణరావు, ఎ.శ్రీనివాసరావు, మసన్‌రాజు, ఎం.అన్వేష్, పిట్టా రెడ్డి, బి.శశిభూషణరావు, గంట్యాడ గురుమూర్తి, గంట్యాడ గోవిందరాజు, కాకినాడ పెంటారావు, ములకలపల్లి పెంటారావు తదితరులు పాల్గొన్నారు.

## స్టీల్‌ప్లాంట్‌లో సీసీక్యూసీ – 2025 పోటీలు ప్రారంభం



జ్యోతి ప్రజ్వలనతో పోటీలు ప్రారంభిస్తున్న స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ సలీం

ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్‌లో చాప్టర్ కన్వెన్షన్ ఆన్ క్వాలిటీ కాన్సెప్ట్ (సీసీక్యూసీ) – 2025 పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. క్వాలిటీ సర్కిల్ ఫోరం ఆఫ్ ఇండియా (క్యూసీఎఫ్ఐ) ఆధ్వర్యంలో ఉక్కునగరం ఎంపీ హాలులో ఏర్పాటు చేసిన రెండు రోజుల కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (ఆపరేషన్స్) సలీం జి పురుషోత్తమన్, ఏటీసీ టైర్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ బి.ప్రహ్లాద్ రెడ్డి, ఎన్టీపీసీ సింహాద్రి ఈడీ సమీర్ శర్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్యూసీఎఫ్ఐ చాప్టర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలను కొనియాడారు. చాప్టర్ చైర్మన్ జి.గాంధీ మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో 34 సంస్థలకు చెందిన 683 మంది ప్రతినిధులు పాల్గొంటున్నారన్నారు. రెండు రోజుల కార్యక్రమంలో క్వాలిటీ సర్కిల్స్, ఫైవ్ ఎస్, కై జన్, లీన్ క్వాలిటీ సర్కిల్ పోటీలు జరుగుతాయన్నారు. వైస్ చైర్మన్ కమోడోర్ గగన్‌దీప్ సింగ్, కార్యదర్శి ఎం.ఈ.సి.వి.సాగర్ వివరాలు వెల్లడించారు.

## కాత్యాయనీదేవి అలంకరణలో కనకదుర్గమ్మ



బర్మాకాలనీలో కాత్యాయనీదేవిగా కనకదుర్గమ్మ



శివాలయంలో కాత్యాయనీదేవిగా దుర్గమ్మ



ఉక్కు త్రిశక్తి దేవాలయంలో కాత్యాయనీదేవి అవతారంలో...



భవానీ భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి, నాగిశెట్టి శ్రీను

పెదగంట్యాడ : దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. అమ్మవారి ఆలయాలతోపాటు, పలుచోట్ల ఏర్పాటు చేసిన మండపాల్లో ప్రతేక పూజలు నిర్వహిస్తున్నారు. జీవీఎంసీ 76వ వార్డు పరిధి బర్మా కాలనీలోని కనకదుర్గ ఆలయంలో అమ్మవారిని గురువారం కాత్యాయనీ దేవిగా అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు. బాలచెరువు శివాలయంలో ఏర్పాటు చేసిన మండపంలో అమ్మవారిని అర్చకుడు వాసుదేవశర్మ ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

- జీవీఎంసీ 65వ వార్డు పరిధి బీసీ రోడ్డులో వైఎస్సార్‌సీపీ నాయకుడు నాగిశెట్టి శ్రీను ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. కార్యక్రమంలో 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. నాగిశెట్టి ఆధ్వర్యంలో భవానీ భక్తులకు ఏర్పాటు చేసిన అన్నసమరాధనను ప్రారంభించారు. కార్యక్రమంలో మన్మధరావు, మూల గిరిబాబు, శ్రీను, జగన్ తదితరులు పాల్గొన్నారు.

**ఘనంగా సహస్ర హరిద్ర ఖండార్చన**

ఉక్కునగరం: శ్రీమహాదుర్గ, శ్రీమహాలక్ష్మి, శ్రీమహాసరస్వతి అమ్మవార్లు ఒకే మండపంలో వెలిసిన అరుదైన ఉక్కునగరం త్రిశక్తి దేవాలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా నాలుగో రోజు గురువారం శ్రీమహాదుర్గ అమ్మవారు ఆకుపచ్చ వర్ణం చీరలో కాత్యాయినీదేవి అవతారంలో, శ్రీమహాలక్ష్మి అమ్మవారు గులాబీ వర్ణం చీరలో సంతానలక్ష్మి అవతారంలో, శ్రీమహాసరస్వతి అమ్మవారు తెలుపు వర్ణం చీరలో హంసవాహినీ దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమాల్లో భాగంగా ఆలయ ప్రధాన అర్చకులు ఫణిశర్మ నేతృత్వంలో ఉదయం అమ్మవార్లకు సహస్ర హరిద్ర ఖండార్చన చేశారు. చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సాయంత్రం మహిళలచే సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

## సముద్ర వనరులను వినియోగించుకోవాలి



సదస్సు సంచిక ఆవిష్కరిస్తున్న గుప్త, తదితరులు

ఏయూ క్యాంపస్ : సముద్ర వనరులను సమర్థంగా వినియోగించుకోవాలని సీఎంఎల్ఆర్ఈ మాజీ డైరెక్టర్ డాక్టర్ జి.వి.ఎం.గుప్త సూచించారు. బీచ్‌రోడ్డులోని ఐకార్ – సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ టెక్నాలజీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన సముద్ర ఆరోగ్యం, సుస్థిర అభివృద్ధి – సవాళ్లు, పరిష్కారాలు సదస్సు ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సముద్ర వనరులను అర్థం చేసుకోవడం ఎంతో ప్రధానమన్నారు. అంతర్జాతీయ జలాల్లో వనరులను సుస్థిరంగా వినియోగించుకోవాలని సూచించారు. ఐకార్ – సిఫ్ట్ ఇన్‌చార్జి సైంటిస్ట్ డాక్టర్ బి.మధుసూధనరావు మాట్లాడుతూ మానవ ఆరోగ్యం, బ్లూ ఎకానమీలో సముద్రాల భూమికను వివరించారు. ఐకార్ – సిఫ్ట్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ యు.శ్రీధర్ మాట్లాడుతూ సదస్సు ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం ఐకార్ – సిఫ్ట్, ఏ గ్లింప్స్ శీర్షికతో తీర్చిదిద్దిన హిందీ సంచికను ఆవిష్కరించారు.

## స్వచ్ఛతతోనే ప్రగతి

మల్కాపురం: స్వచ్ఛతతోనే ప్రగతి సాధ్యమని 60వ వార్డు కార్పొరేటర్ పి.వి.సురేష్ అన్నారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా గురువారం వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉరుకూటి సతీష్‌యాదవ్ ఆధ్వర్యంలో గుల్లలపాలెం వాకింగ్ పార్క్ పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పాండ్రగి జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.